

విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## సమస్యల పరిష్కారానికి కృషి : విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి (చందుర్తి) అక్టోబర్ 21: రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, మాట్లాడారు. త్వరలోనే రుద్రంగి జూనియర్ కళాశాలలోని సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రహరీ నిర్మాణంతోపాటు మొదటి అంతస్తులో మరమ్మతులకు విధులు కేటాయిస్తానన్నారు. బోరుబావికి రెండు రోజుల్లోగా నిధులు మంజూ రు చేసి పనులు పూరి చేస్తామన్నారు. ఇక్కడ కాంగ్రెస్ నేతలు సామ మోహన్, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, కొమిరె శంకర్, దాసరి గంగరాజం, గంగాధర్ ఉన్నారు.

***విప్‌ను కలిసిన సెస్ డైరెక్టర్***

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసను సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం మర్యాదపూర్వకంగా కలిశారు. రుద్రంగి మండల కేంద్రంలో సెస్ సేవాసదన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, మండలంలోని విద్యుత్ సమస్యల పరిష్కారంపై ఆయన విప్‌తో చర్చించారు. ఇక్కడ సెస్ ఏఈ కుమారస్వామి, సిబ్బంది ఉన్నారు.

## హరహర మహదేవ..

- రాజన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం
- స్వామివారిని దర్శించుకున్న 50వేలకు పైగా భక్తులు

వేములవాడ టౌన్, అక్టోబర్ 21: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. వేకువజాముననే భక్తులు పవిత్రస్నానాలు ఆచరించి.. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, కోడె మొక్కు చెల్లించుకున్నారు. క్యూలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు ₹32లక్షల ఆదాయం సమకూరగా, స్వామివారిని 50వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతి రావు, వరి నర్సయ్య, ఇన్‌స్పెక్టర్లు నూగూరి నరేందర్, నునుగొండ రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.



స్వామివారి దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు


























